

## ప్రాజెక్టు ఉద్దేశం..

ఉప్పల్ జంక్షన్ నుంచి నల్ల చెరువు, పీర్జాదిగూడ కమాన్, బోడుప్పల్ డిపో, మేడిపల్లి, చెంగిచర్ల చౌరస్తా వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. వాహనాలు నిత్యం గంటల తరబడి రోడ్లపై నిలిచి పోతుంటాయి. ఇక వర్షం వచ్చినప్పుడు, ఫంక్షన్లు ఉన్నప్పుడు పరిస్థితి మరింత జఠిలంగా ఘోరంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్కైవే నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 163 జాతీయ రహదారిపై 6.25 కిలోమీటర్ల మేర 145 పిల్లర్లతో పనులు ప్రారంభమయ్యాయి. ఇది ఆరు లైన్ల స్కైవే. 2018 మేలో పనులకు శ్రీకారం చుట్టగా.. 2020 జూన్ వరకు నిర్మాణం పూర్తవుతుందని లక్ష్యంతో అధికారులు పనులు చేపట్టారు. ఉప్పల్ ఎలక్ట్రికల్ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే ఈ కారిడార్ నారపల్లి సీపీఆర్ఐ వద్ద ముగుస్తుంది. ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.670 కోట్లు. ఇప్పటికే దాదాపు 52 పిల్లర్లు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. నల్ల చెరువుపై ఆరు పోర్టల్ బీమ్‌లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. నారపల్లి వద్ద స్లాబ్ పనులు జరుగుతున్నాయని చెబుతున్నారు. కానీ ఉప్పల్ ప్రాంతంలో పిల్లర్స్ పనులు చేయడంలో ఆలస్యం చేస్తుండడం గమనార్హం. ముఖ్యంగా పనులు పూర్తిచేయడంలో ఆలస్యం కావడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. వీటితోపాటు, రోడ్డు వేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతుంది.

# 6 కిలోమీటర్లు.. ఏడేండ్లు

## ఇంకెన్నాళ్లు ఈ నరకయాతన ?

- 40 శాతం దాటని 'ఉప్పల్ - నారపల్లి' ఫ్లై ఓవర్ పనులు
- కేంద్ర మంత్రుల పర్యటన సందర్భంగా ప్రశ్నిస్తున్న ఉప్పల్ వాసులు
- 16 నెలల కాంగ్రెస్ పాలనలోనూ కనీస చొరవ తీసుకోని వైనం

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ) : ఆరు కిలోమీటర్లు.. ఏడేండ్లు.. ఇది ఒక్క ఫ్లై ఓవర్ నిర్మాణ పనులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యపు వైఖరి.. వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు 2018లో ఉప్పల్ రింగు రోడ్డు- నారపల్లి వరకు 6.25 కిలోమీటర్ల మేరలో ఎలివేటెడ్ కారిడార్ పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. ఒప్పందం ప్రకారం రెండేండ్లలలో పనులు పూర్తి చేయాలి. ప్రాజెక్టులో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం భూ సేకరణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి నిర్మాణ పనులు కేంద్ర ప్రభుత్వం జరపాల్సి ఉండగా, సంవత్సరాల తరబడి పనులను కొనసాగిస్తూ వాహనదారుల కష్టాలను అధికం చేసింది. పనులు 40 శాతం కూడా పూర్తి కాలేదు. సర్వీస్ రోడ్డు గుంతలు పడి ప్రజా రవాణా సరిగా సాగక... వర్షం పడితే వాహనాలు ముందుకు కదలేక వాహనదారులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం సైతం గడిచిన 16 నెలలుగా కనీసం పనులను ప్రారంభించే చొరవ తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఒకే సమయంలో మొదలైన అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించిన సందర్భంగా ఇంకెన్నాళ్లు ఈ నరక యాతన అంటూ ఉప్పల్-నారపల్లి ఫ్లై ఓవర్ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2026 అక్టోబర్ 31 నాటికి ఈ కారిడార్‌ను పూర్తి చేస్తామని చెబుతున్నారే తప్ప.. క్షేత్రస్థాయిలో ఇంకా నిలిచిపోయిన పనులు నేటికీ ప్రారంభం కాకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి.

### పనులు పూర్తి చేయడంలో వైఫల్యం



ఉప్పల్ నుంచి నారపల్లి ఫ్లై ఓవర్ పనుల పూర్తి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. కారిడార్ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు చెప్పి 15 మాసాలు అయినా ఇప్పటి వరకు పూర్తి చేయడం లేదు. ప్రతి నిత్యం వేలాది వాహనాలు, ప్రజలు నడి చే రహదారి గుంతలు పడి వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

-గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు
మాజీ కార్పొరేటర్, రామంతాపూర్

### కారిడార్ పనులు ఎప్పుడు పూర్తిచేస్తారు



ఉప్పల్ ఫ్లైవర్ కారిడార్ పనులు ప్రారంభించి దాదాపు పది సంవత్సరాలకు పై అయినా ఇప్పటికీ పనులు పూర్తికాక పోవడం దారుణం. ఈ రహదారి వెంబడి నడిచే వాహనదారులు, ప్రజలు తీవ్రమైన అవస్థలు పడుతున్నాం.

- తిప్పని సంపత్ కుమార్, రామాంతాపూర్

### ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి

ఒక అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ దుస్థితి. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన కేంద్రం ఏండ్లకు ఏండ్ల తరబడి ప్రాజెక్టులు చేపడుతూ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నది. ఉప్పల్ రింగు రోడ్డు నుంచి నారాపల్లి వరకు రూ. 626.8కోట్ల వ్యయంతో 6.25 కిలోమీటర్ల మేర ఆకాశమార్గంలో ఆరు వరుసల్లో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి 2018 మే 5న కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఏండేండ్లు కావచ్చినా 40 శాతం మేర కూడా పనులు పూర్తవ్వలేదు. ఫలితంగా ప్రజలు, ఇటు వాహనదారులు నరకయాతనకు గురవుతున్నారు.మొదట్లో ఆస్తుల సేకరణ పూర్తయితే కానీ, పనులు ప్రారంభించేది లేదని గతంలో స్పష్టం చేసిన ఎన్‌హెచ్ఏఐ అధికారులు.. జీహెచ్ఎంసీ భూసేకరణలో ఎన్నో అవాంతరాలు ఎదుర్కొని రెండేండ్లలోపే పనులు వేగవంతం చేయడంలో విఫలమయ్యారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉప్పల్ -నారపల్లి కారిడార్ పనులు ప్రస్తుత స్పీడుతో కొనసాగితే మరో రెండేళ్లయినా పూర్తయ్యే పరిస్థితి లేదని స్థానికులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మేడిపల్లి నుంచి ఉప్పల్ రావడానికి ఒక్కోసారి గంట పడుతోంది. కారిడార్ పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారం ఏమో కానీ, నిలిచిన నిర్మాణం పనులతో నరక యాతన అనుభవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా నగరం నుంచి వరంగల్ వైపు వెళ్లే వారు ఉప్పల్ రింగు రోడ్డు, బోడుప్పల్, మేడిపల్లి, చెంగిచర్ల చౌరస్తాల్లో ట్రాఫిక్ రద్దీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తిచేయాలి

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వినతి



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్, మే 5: ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం అంబర్‌పేటలో ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి వచ్చిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇప్పటికే ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని.. వెంటనే పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే పూర్తిచేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.




నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, మహిళా నేతలు

## అందాల పోటీలను రద్దుచేయాలి


### పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అందాల పోటీలను తక్షణమే రద్దుచేయాలని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య డిమాండ్ చేశారు. ఏ ప్రయోజనం కోసం ఈ పోటీలను నిర్వహిస్తున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పీవోడబ్ల్యూ సంధ్య, మహిళా సంఘం నాయకురాలు సత్య మాట్లాడుతూ.. కార్పొరేట్ విస్తరణలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తోందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 'ఈ కార్' రేసును నిర్వహిస్తే వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అందాల పోటీలను ఏ విధంగా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే మిస్ వరల్డ్ పోటీలను వెంటనే రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.అందాల పోటీలకు ఖర్చు చేసే సుమారు రూ.200 కోట్లను విద్యారంగంలో మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించాలని సూచించారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

### డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ ): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను ఆమె అధికారులతో కలిసి స్వీకరించారు. ఆయా అర్జీలను త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంతి చెప్పారు. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా మొత్తం 171 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, వేణుగోపాల్, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, గీతా రాధిక, టౌన్‌ప్లానింగ్ అడిషనల్ సీసీపీలు ప్రదీప్, గంగాధర్, వీరన్న, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.




ఫిర్యాదులను స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి

### కలెక్టరేట్‌లో 99 అర్జీలు..

జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 99 వినతులు వచ్చాయి. అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ జి ముకుందరెడ్డి స్వయంగా స్వీకరించారు. అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్ఓ వెంకటచారి, ఆర్డీవో రామకృష్ణ, జిల్లా అధికారులు జి.ఆశన్న, ఆర్ కోటాజీ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అదే తంతు.. మళ్లీ మెట్రో బ్రేక్‌డౌన్

### ఎస్ఆర్ నుంచి పంజాగుట్ట వరకు మూడు సార్ల నిలిచిన సేవలు

సిటీబ్యూరో, మే 5(నమస్తే తెలంగాణ) : ఆధునాతన సాంకేతికతో నడిచే మెట్రో రైలుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతుందో తెలియక జనాలు భయపడిపోతున్నారు. తాజాగా సోమవారం రాత్రి మియాపూర్ నుంచి ఎల్బీ నగర్ వెళ్లే మార్గంలో మెట్రో సర్వీసు ఏకంగా 20 నిమిషాల పాటు పలు ప్రాంతాల్లో నిలిచి పోయినట్లుగా మెట్రో ప్రయాణికులు వివరించారు. రాత్రి 10గంటల సమయంలో మియాపూర్ నుంచి బయలుదేరగా... ఎల్బీ నగర వెళ్లేందుకు కొందరు ప్రయాణికులు జెఎన్‌టీయూ స్టేషన్ వద్ద ఎక్కారు. అక్కడి నుంచి ఎస్ఆర్ నగర్‌లో ఐదు నిమిషాల పాటు ఓసారి, అక్కడి నుంచి బయలుదేరిన వెంటనే అమీర్‌పేట్ వద్ద మరోసారి, ఇక పంజాగుట్ట వైపు వెళ్లే సమయంలో ఒక్క కుదుపుతో 10 నిమిషాల పాటు బ్రేక్ డౌనైనట్లుగా వెల్లడించారు. తరుచూగా ఇదే మార్గంలో మెట్రో రైలు ఆగిపోవడానికి గల సమస్యలపై దృష్టి పెట్టకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### ఓవైపు వర్షం..

సాధారణ వర్షంలో జనాలు మెట్రోను ఆశ్రయించగా.. తక్కువ మందితోనే ఎల్బీ నగర్ వైపు బయలుదేరింది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఎస్ఆర్ నగర్ నుంచి పంజాగుట్ట వరకు మూడు సార్లు నిలిచిపోవడంతో ఎల్బీ నగర్ నుంచి మియాపూర్ వెళ్లే మెట్రో సర్వీసులకు అంతరాయం కలిగింది. దీంతో సిబ్బంది వచ్చి ట్రాక్‌ను పరిశీలించిన పిదప ముందుగా మియాపూర్ నుంచి ఎల్బీ నగర్ సర్వీసు బయలుదేరిన తర్వాతే ... ఎదురుగా వస్తున్న మెట్రోను పంపినట్లుగా ప్రయాణికులు వివరించారు.

## డబుల్ ఇళ్లలో వసతులు కల్పించాలి

### ఎమ్మెల్యే వివేకానంద్ సమీక్ష

కుత్బుల్లాపూర్, మే 5: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించిన డబల్ బెడ్‌రూమ్ సముదాయాలలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు సూచించారు. సోమవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాలలో నెలకొని ఉన్న సమస్యలపై అధికారులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలనే ఆలోచనతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సకల సదుపాయాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారన్నారు.



అధికారులతో చర్చిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే వివేకానంద్

ఇల్లు పొందిన లబ్ధిదారులు అక్కడ ఉండేందుకు అవసరమైన కనీస అవసరాలను అందించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం వహించడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, రవాణా సౌకర్యం, ప్రార్థన మందిరాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు వంటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అన్నారు. వీధిదీపాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్, మున్సిపాలిటీ, ఇంజినీరింగ్, వివిధ శాఖల అధికారులు, డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్‌పై దాడి

### నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు



సబ్ రిజిస్ట్రార్ రవీందర్ నాయక్

హయత్ నగర్, మే 5 : పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్‌పై దాడికి పాల్పడిన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. హయత్‌నగర్ పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు.. పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవీందర్ నాయక్‌ను సోమవారం మధ్యాహ్నం పెద్దఅంబర్‌పేటకు చెందిన పిల్లి శ్రీనివాస్ మూడు డాక్యుమెంట్లతో ఆఫీస్‌లో కలిశాడు. ఆయా డాక్యుమెంట్లలో జనవరిలో రిజిస్ట్రేషన్ చేసిన రెండు డాక్యుమెంట్లను రద్దుచేయాలని కోరగా సబ్ రిజస్ట్రార్ నిరాకరించాడు. రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం తన పరిధిలో లేదని వారిని కోర్టుని ఆశ్రయించాలని తెలిపాడు. దీంతో కోపోద్రిక్తుడైన పిల్లి శ్రీనివాస్.. సబ్ రిజిస్ట్రార్ రవీందర్ నాయక్‌పై దాడికి పాల్పడ్డాడు. కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్‌ను అడ్డుకొని అక్కడి నుండి పంపించారు. తదనంతరం సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

అబిడ్స్ మే 5: విధి నిర్వహణలో ఉన్న పెద్దఅంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ ఎల్ రవీందర్‌పైన శ్రీనివాస్ యాదవ్ అనే వ్యక్తి దాడి చేయడాన్ని టీఎన్జీవో కేంద్ర సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేని సోమవారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్మెంట్ అదనపు ఇన్స్పెక్టర్ జనరల్ వెంకట రాజేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సదరు వ్యక్తికి అభ్యంతరాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి కానీ దాడులు చేయడం సరికాదన్నారు. ఈ విషయమై మంగళవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస గౌడ్, గోవర్ధన్ రెడ్డి, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు కట్కూరి శ్రీకాంత్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నాయకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతకు ఎంపీ పరామర్శ

ఖైరతాబాద్, మే 5: నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నేత చెంగలి నర్సింహారావును బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంకు చెందిన నర్సింహారావు కొంతకాలంగా మెదడులో కణితితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకురాగా.. ఆయన తక్షణమే స్పందించి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పతో మాట్లాడి తక్షణ వైద్యం అందించాల్సిందిగా కోరారు. ఆయన సూచన మేరకు దవాఖానలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి కణతిని తొలగించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్న నర్సింహారావును పరామర్శించిన ఎంపీ వద్దిరాజు.. ఆయన సతీమణి నాగమణి, కుమార్తె నాగశైలుకు ధైర్యం చెప్పారు. నర్సింహా రావుకు పూర్తిగా స్వస్థత చేకూరేంత వరకు సహకారం అందిస్తానని తెలిపారు. ఆయన వెంట సీనియర్ హైకోర్టు న్యాయవాది ఊస రఘు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్, వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు లకావత్ గిరిబాబు, సంజీవ్ నాయక్, ఆవుల రామారావు, సీనియర్ జర్నలిస్టు మురళి తదితరులు ఉన్నారు.



నర్సింహారావును పరామర్శివస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్స్ హైదరాబాద్ చేరుకుంటున్నారు. ఇప్పటికే మిస్ సౌతాఫ్రికా జోయలస్ జాన్సెన్, మిస్ బ్రెజిల్ జెస్సికా పెడ్రోసో, మిస్ వరల్డ్ సీఈఓ, చైర్‌పర్సన్ జూలియా ఈవెలిన్ మోర్లీ, మిస్ కెనడా ఎమ్మా డయానా హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాగా సోమవారం పలువురు కంటెస్టెంట్స్ హైదరాబాద్ ఆర్‌జీఐఏ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా అధికారులు వారికి సాదర స్వాగతం పలికారు.

## పోలీస్ రీల్ కంటెస్ట్

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): ప్రతిభను ప్రోత్సహించడంలో హైదరాబాద్ పోలీసులు ముందుంటారని, ఇదే క్రమంలో మహిళల రక్షణ, సైబర్ సేఫ్టీ ప్రధాన అంశాలుగా 'రీల్ కంటెస్ట్'ను నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ సిటీ పోలీసులు తెలిపారు. ఈనెల 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 15వ తేదీలోగా రీల్ పంపాలని వారు కోరారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వారి ప్రతిభ ఆధారంగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు నగదు బహుమతి అందిస్తామని, ఇతర వివరాలకు 73375 51179 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

### ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్

సిటీబ్యూరో, మే 5(నమస్తే తెలంగాణ): చిన్నారుల్లో ట్రాఫిక్ అవేర్‌నెస్, రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించడానికి గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రెయినింగ్ సెంటర్‌లో సిటీ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను సోమవారం ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్‌డేవిస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరంలో పిల్లలకు డాన్స్, సంగీతం, పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్‌లో నైపుణ్యం పెంచడం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలకు కారణాలు తెలిపి వాటిని నివారించడంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై కూడా వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. హోండా మోటార్ సైకిల్ జోనల్ సేల్స్‌హెడ్ దిలీప్‌కుమార్, ఆర్యన్ డాన్స్ నిర్వాహకులు సరోజ్ బాల, రాజ్ ఈవెంట్స్ నిర్వాహకులు అనంత్‌రాజ్, ట్రాఫిక్ డీసీపీలు వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ రవీందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో జోయల్ డేవిస్ తదితరులు

## వేద పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

అంబర్ పేట, మే 5: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ వైదిక పాఠశాలలో ఉచిత ప్రవేశాలు జరుగుతున్నాయని సంస్థాపకులు, మహామండలేశ్వర్ పీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహరాజ్, దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 14ఏళ్లలోపు వారు అర్హులని చెప్పారు. వేదంపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ, ఏ వర్ణానికి చెందినవారైనా అర్హులేనని తెలిపారు. ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలలో 90 మంది విద్యార్థులు కృష్ణ యజుర్వేదంలోని వివిధ కోర్సులు చదువుతున్నారని వారు పేర్కొన్నారు. ఆశ్రమంలో వేదం పఠించే విద్యార్థులకు ఉచిత బోధన, భోజనం, వసతి కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఆరేళ్లపాటు శిక్షణ ఉంటుందని వారు అన్నారు. ప్రవేశ, వర, ప్రవర కోర్సులు (అర్చక, పౌరోహిత్య షోడశ సంస్కార విద్య) వేదాంత విజ్ఞానంపై బోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు సిద్దేశ్వరానందగిరి మహరాజ్ ఆధ్వర్యంలో వేదాంత, న్యాయ, యోగ దర్శనం, ధ్యానం, భజన, గ్రంథపఠనం తదితర తరగతులు ఉంటాయని అల్లాడి వీరేశం పేర్కొన్నారు. ప్రస్తుతం ముగ్గురు ఆచార్యులు పాఠశాలలో పనిచేస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తులు ప్రారంభమైనట్లు వివరించారు. ఈనెల 29న మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. జూన్ 5న అడ్మిషన్లు జరుగుతాయని, జూన్ 12న లింగదీక్షతో తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గలవారు దత్తగిరి ఆశ్రమ కార్యాలయాన్ని లేదా మరింత సమాచారం కోసం 9177259329, 86392 58008 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

